క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి పోతునూరు రాక

దెందులూరు: ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి శుక్రవారం పోతునూరు గ్రామం విచ్చేస్తారని సర్పంచ్ బోదుల స్వరూప్ తెలిపారు. ఉదయం 11 గంటలకు సీఎస్ఐ చర్చి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని, కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, పాస్టర్లు పాల్గొనాలని కోరారు.

నేడు దోసపాడులో గడప గడపకు మన ప్రభుత్వం

దెందులూరు: మండలంలోని దోసపాడు గ్రామంలో సాయంత్రం 4 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం, పల్లెకుపోదాం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని తెలిపారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొంటారని, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరు కావాలని ఆయన కోరారు .

దిశ స్టేషన్‌ను సందర్శించిన శ్రీపూజ



దిశ స్టేషన్‌ను సందర్శించిన ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీపూజ

ఏలూరు టౌన్ : ఏలూరు జిల్లా ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీపూజ తన విధుల్లో భాగంగా ఏలూరు దిశ పోలీసు స్టేషన్‌లో విధులు, కేసుల దర్యాప్తును పరిశీలించారు. ఏలూరు కోటదిబ్బలోని దిశ పోలీస్ స్టేషన్‌కు గురువారం ఆమె వెళ్లారు. దిశ సీఐ విశ్వం, ఎస్సై క్రాంతిప్రియ ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. రికార్డుల నిర్వహణ, కేసుల నమోదును శ్రీపూజ పరిశీలించారు. ఈవ్ టీజింగ్ అరికట్టటం, భార్యాభర్తల కేసుల్లో కౌన్సెలింగ్ ఇవ్వటం, దిశ కంట్రోల్ రూమ్ 112 ద్వారా బాధితులకు సత్వర సాయం, గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించటం వంటి విషయాలను సీఐ విశ్వం శ్రీపూజకు వివరించారు.

బాలికల చట్టాలు, హక్కులపై అవగాహన



విద్యార్థినులతో రిబ్కారాణి, అధ్యాపకులు

ఏలూరు (టూటౌన్): బాలికలు తమ హక్కులు, చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని బాలల సంక్షేమ సమితి జిల్లా చైర్‌పర్సన్ రిబ్కారాణి అన్నారు. స్థానిక సీఆర్ఆర్ డి.ఫార్మసీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్, గ్రీవెన్స్, రిడ్రెస్సల్ సెల్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రిబ్కారాణి నేటి రోజుల్లో బాల్యవివాహాలు, బాలికలపై జరిగే అఘాయిత్యాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మానసిక సమస్యలు, ఆడపిల్లల రక్షణ పథకాలు, బాలికల భద్రత, శిశు అభివృద్ధి సంక్షేమ పథకాలు, వరకట్న వేధింపులు వంటిపై మాట్లాడారు. బాలికలు, మహిళలు తమదైన శైలిలో వ్యవహరించి అన్యాయాలను అరికట్టే దిశగా ముందుకెళ్లాలని సూచించారు. సదస్సుకు ఎ.రేవతి, ఆర్ భ్రమరాంబలు సమన్వయ కర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎం.రాజరామోహనరావు, ప్రిన్సిపాల్ ఎ.నరేంద్ర బాబు, విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

చెరకు టన్నుకు రూ.5 వేలు ప్రకటించాలి

ఏలూరు (టూటౌన్): 2023–24 క్రషింగ్ సీజన్‌కు ఆంధ్రా సుగర్స్ యాజమాన్యం చెరకు టన్నుకు ప్రకటించిన రూ.3,200 మద్దతు ధర రైతులకు సరిపోదని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. స్థానిక అన్నే భవన్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో చెరకు మద్దతు ధరపై సంఘం అధ్యక్ష కార్యదర్శులు నిమ్మగడ్డ నర్సింహ, కె.శ్రీనివాస్ మాట్లాడారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులను పరిగణలోకి తీసుకొని మద్దతు ధర ప్రకటించలేదని అన్నారు. జాతీయ వ్యవసాయ కమిషన్ రికమండ్ చేసిన సీ2+50 శాతం ప్రకారంగా చెరకు సాగు ఖర్చులు లెక్కించి, వాటిపై 50 శాతం ధర పెంచి నిర్ణయిస్తే టన్ను చెరకు రూ.5 వేలు ఇవ్వాలని కోరారు. చెరకు రవాణా, కటింగ్ చార్జీలు విపరీతంగా పెరిగిపోయాయని తెలిపారు. ప్రస్తుత కటింగ్ సీజన్‌కు చెరకు టన్నుకు రూ.5 వేలు మద్దతు ధర ప్రకటించి చెరకు రైతులను ఆదుకోవాలని వారు కోరారు.

జీతాలు పెంచాలి

ఏలూరు (టూటౌన్): పెరిగిన ధరలకు అనుగుణంగా ఆశల జీతాలు పెంచాలని ఆశా వర్కర్స యూనియన్ జనరల్ బాడీ సమావేశం కోరింది. స్థానిక నరసింహరావుపేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా జనరల్ బాడీ సమావేశం గురువారం నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.పోశమ్మ, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ లింగరాజు, డీఎన్‌వీడీ ప్రసాద్‌లు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. నాయకులు కామేశ్వరి, లోకేశ్వరి, కుమారి, నాగమణి, శాంత కుమారి, మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే జగనన్న లక్ష్యం

- వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సత్యకుమార్
- చానమిల్లిలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

నిడమర్రు: పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ అన్నారు. గురువారం చానమిల్లి గ్రామ సచివాలయం పరిధిలోని చానమిల్లి, సిద్ధాపురం గ్రామాల్లో సత్యకుమార్ ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పార్టీలకు, వర్గాలకు, కులాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చేలా సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. సత్యకుమార్ మాట్లాడుతూ చానమిల్లి సచివాలయం పరిధిలో నాలుగున్నరేళ్లలో రూ.29 కోట్లు ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. ఈ వివరాలతో కూడిన సంక్షేమ బోర్డును గ్రామ పంచాయతీ వద్ద ఆయన ఆవిష్కరించారు. తొలుత ఆయా గ్రామాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి అభివృద్ధికి సంబంధించిన బ్రోచర్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కోడే కాశి, మండల సచివాలయాల కన్వీనర్ నౌడు అచ్యుతరామారావు, సర్పంచ్ నంద్యాల ప్రసాద్, వైస్ సర్పంచ్ వెజ్జు నరేష్, ఎంపీటీసీ కొత్తల సింహాచలం, సిరపరపు శ్రీను, ముద్దం శేషు, కొండపల్లి రామకృష్ణ, బేతు స్వామి, గంటసాల పోతురాజు, కురుపూడి గంగరాజు, ఇపిచర్ల కుమార్, నుతులపాటి పాండు తదితరులున్నారు.

పారదర్శకంగా పథకాల అమలు

భీమడోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేయడంతో ఆయా కుటుంబాలు ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నాయని ఎంపీపీ కనమాల రామయ్య అన్నారు. కోరుకల్లు సచివాలయం వద్ద గురువారం సాయంత్రం ఏపీకి జగనే ఎందుకు కావాలి నినాదంతో భాగంగా పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం వద్ద సంక్షేమ లబ్ధిని తెలిపే ఫ్లెక్సీని ఆవిష్కరించారు. సర్పంచ్ దాట్ల సుబ్బలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటుచేసిన సభలో ఎంపీపీ రామయ్య మాట్లాడుతూ ప్రతి సంక్షేమ పథకం లబ్ధిని అర్హులకు నేరుగా అందించిన ఘనత జగనన్న ప్రభుత్వానిదేనని చెప్పారు. కోరుకల్లు, లక్ష్మీపురం గ్రామ పంచాయతీ పరిధిలో రూ.7 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేశారని చెప్పారు. వైఎస్సార్ సీపీ పాలనలో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉన్నారని వివరించారు. జగన్ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావిస్తోందని అన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలొకి తొక్కారని గుర్తుచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, జిల్లా కార్యనిర్వాహక సభ్యుడు తుమ్మగుంట రంగ, నాయకులు వేములమంద రామరాజు, వార్డు సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు అంబర్‌పేటలో..

ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం శుక్రవారం సాయంత్రం 4 గంటలకు అంబర్‌పేటలో ఏర్పాటుచేశామని పార్టీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావులు తెలిపారు. పార్టీ నాయకులు, గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు తదితరులంతా హాజరవ్వాలని కోరారు.

పేదల అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

ఉంగుటూరు: పేదలు అభ్యున్నతి, అభివృద్ధి సీఎం జగన్ వల్లే సాధ్యమని వైఎస్సార్ సీపీ ఉంగుటూరు మండల నాయకులు పేర్కొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మరడ మంగారావు ఆధ్వర్యంలో కైకరం సచివాలయం-2 పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. రూ.28 కోట్ల అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన బోర్డులను ఆవిష్కరించారు. మంగారావు మాట్లాడుతూ ప్రతిపక్షాలు అడ్డుపడినప్పటికీ ఇచ్చిన మాటకోసం జగన్ సంక్షేమ పథకాలన్నీ అమలు చేశారని వివరించారు. జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి మాట్లాడుతూ విద్యారంగానికి జగన్ అధిక ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఎస్సీ, బీసీ వర్గాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రముఖ స్థానం కల్పించారని, ఇదొక చరిత్ర అని అన్నారు. పార్టీ పంచాయతీ రాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ, వలంటీరు వ్యవస్థతో పరిపాలన ప్రజల ముంగిటకు వచ్చిందని తెలిపారు. పార్టీ సచివాలయాల మండల కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ మాట్లాడుతూ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని అన్నారు. తొలుత రాజశేఖరెడ్డి విగ్రహానికి నాయకులు పూల మాలలువేసి నివాళులర్పించారు. పార్టీ జెండాను మంగారావు ఎగురవేశారు. ప్రజలకు వారు పొందిన పథకాల లబ్ధి బ్రోచర్లను అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు యెలిశెట్టి పాపారావు బాబ్జి, పార్టీ నాయకలు నక్కా శ్రీను, ఉపసర్పంచ్ మట్టా మురళి, జార్జి అనిల్, భాస్కరరావు, రవి, గంజి ప్రభాకరరావు, కొల్లాబత్తుల నాగరాజు, ఇందేటి దూవదినం, శానం సత్తిబాబు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పాలన

పెదపాడు : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్ తెలిపారు. పెదపాడు మండలం వేంపాడు గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాలు వివరాలతో కూడిన బోర్డును అప్పన ప్రసాద్ ప్రారంభించారు. ఈ బోర్డులో ప్రభుత్వం వేంపాడు గ్రామ సచివాలయ పరిధిలోని ప్రజలకు అందించిన పథకాలు వివరాలను ప్రదర్శించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన పథకాలపై అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బత్తుల రత్నకుమారి, బీసీ సెల్ అధ్యక్షుడు, సర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ అప్పన ప్రసాద్, సర్పంచ్ మరీదు రెడ్డియ్య, తదితరులు పాల్గొన్నారు.



నిడమర్రు: వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సత్యకుమార్, వెంకటేశ్వరరావు



భీమడోలు: కోరుకల్లులో సంక్షేమ ఫ్లెక్సీని ఆవిష్కరించిన ఎంపీపీ రామయ్య, మండల కన్వీనర్ సత్యశ్రీనివాస్, సర్పంచ్ సుబ్బలక్ష్మి



ఉంగుటూరు: కైకరంలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న మంగారావు



పెదపాడు : వేంపాడులో సంక్షేమ బోర్డును ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ ప్రసాద్

25న మంత్రి ధర్మాన దెందులూరు రాక



మంత్రి రాక ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

దెందులూరు: గ్రామ సచివాలయ భవన ప్రారంభానికి రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఆధ్వర్యంలో ఈ నెల 25న దెందులూరు రానున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని తెలిపారు. సచివాలయం, సమావేశ స్థలాన్ని తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య, పార్టీ మండల అధ్యక్షులు కామిరెడ్డి నాని, జిల్లా కమిటీ సభ్యులు పోకల రాంబాబు, జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు, నాయకులు రాము, రవి, వీఆర్‌ఓ శ్రీనివాసరావులు గురువారం పరిశీలించారు.

చేబ్రోలులో సత్యనారాయణ స్వామి వ్రతాలు



పాండురంగస్వామి ఆలయం వద్ద వ్రతంలో పాల్గొన్న భక్తులు

ఉంగుటూరు: చేబ్రోలు పాండురంగ స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 5 గంటలకు స్వామివారికి చక్రస్నానం, అనంతరం గోదావరి జలాలతో జలాభిషేకం చేశారు. అష్టోత్తర శతనామవళి, పూజలు నిర్వహించారు. గ్రామంలో ఉన్న తొమ్మిది బావులవద్ద అభ్యంగన స్నానాలు చేశారు. అగ్నిగుండం నిర్వహించారు. భజనలు చేశారు. పాండురంగ విఠల్ పాండురంగ అనే గేయాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన



కొత్తూరులో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

పెదపాడు : సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా భావించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కొనియాడారు. పెదపాడు మండలం కొత్తూరు గ్రామంలో గురువారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాడు నేడు పథకం ద్వారా కొత్తూరు గ్రామంలో 10 అదనపు తరగతి గదులు నిర్మించామన్నారు. సీసీ రహదారులు, సచివాలయ భవనం నిర్మించినట్టు చెప్పారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలు గ్రామంలోనే అందిస్తున్నామని తెలిపారు. కుల గణన చరిత్రాత్మకమని ఆయన కొనియాడారు. సామాజిక రాజకీయ ఆర్థిక రంగాల్లో పేదలకు మేలు కలిగించడంలో కులగణన కీలకమన్నారు. గత ప్రభుత్వ హయాంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అరకొర పదవులిచ్చి బలవంతులకే మెజార్టీ పదవులు ఇచ్చేవారని, కానీ, నేడా పరిస్థితి లేదని అన్నారు. సీఎం జగన్ 70 శాతానికిపైగా పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీలకే ఇస్తున్నారని వివరించారు. రూ.42 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. రైతు భరోసా, ఇంటి నిర్మాణానికి రుణం ఇప్పించాలని, సీసీ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టాలను పలువురు గ్రామస్తులు కోరడంతో ఈ సమస్యలకు పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, సర్పంచ్ కడిమి పద్మావతి గోవిందరావు, రాష్ట్ర హస్తకళల బోర్డు డైరక్టరు ముదుగురు సూర్యనారాయణ, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ అక్కినేని గోపి, నాయకులు కడిమి గోవిందరావు, గోగుంట సొసైటీ అధ్యక్షుడు బావరాజు సత్యన్నారాయణ, ఆవల గోవిందరావు, బాల్ద ప్రసాద్, సీహెచ్ సాయి శ్రీనివాస్, కొండేలాజరు, బొల్లు శివయ్య వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

భగవాన్ సత్యసాయి బోధనలు ఆచరణీయం



నాటిక ప్రదర్శిస్తున్న బాల వికాస్ చిన్నారులు

భీమడోలు: భగవాన్ శ్రీసత్యసాయి బోధనలు ఆచరణీయమని వక్తలు పేర్కొన్నారు. శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక సమితి భవనం వద్ద గురువారం భగవాన్ సత్యసాయిబాబా 98వ జయంతి వేడుక ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. నారాయణ సేవ, నామసంకీర్తన, లింగార్చన, బాబా భజన వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. బాల వికాస్ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా నాయకులు అప్పక రాంబాబు మాట్లాడుతూ శ్రీసత్యసాయి బాబా సామాజిక సేవా కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. చిన్నతనం నుంచి ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవడం ద్వారా పరిపూర్ణమైన జ్ఞానమై ప్రశాంత జీవనం పొందుతారని చెప్పారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అన్నసమారాధనలో భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. సత్యసాయి సేవాసమితి మండల కన్వీనర్ వర్ధినీడి సత్యసాయి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, జిల్లా కార్యనిర్వాహక సభ్యుడు తుమ్మగుంట రంగ, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, ఏలూరు సబ్‌జోన్ ఇన్‌చార్జి యలమర్తి సత్తిబాబు, ప్రతినిధులు భారతీదేవి, సభ్యులు పాల్గొన్నారు.

సారా తయారీపై ఉక్కుపాదం మోపాలి

ద్వారకాతిరుమల: గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావును ఏలూరు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఆర్ఎస్ కుమరేశ్వరం గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతపురం జిల్లా నుంచి ఇటీవల బదిలీపై ఏలూరు జిల్లాకు వచ్చిన ఆయన తొలిసారి ఎమ్మెల్యేను దేవరపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయం వద్ద కలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే తలారికి ఆయన దుశ్శాలువాను కప్పి, పూల బొకేను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సారా తయారీ, మద్యం అక్రమ తరలింపులపై ఉక్కుపాదం మోపాలని సూచించారు.

పేదలకు భూములు పంచాలని వినతి



డీఆర్‌ఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): జిల్లాలో ఉన్న 16 రకాల ప్రభుత్వ భూములను పేదలకు పంచి, సాగుకు అవకాశం కల్పించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ కోరింది. ఈ మేరకు గురువారం జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేసింది. ఏలూరు జిల్లాలో భూమిలేని 752 మంది పేదలకు 693.25 ఎకరాల భూమిని పంపిణీ చేస్తున్నట్టు కలెక్టర్ ప్రకటించారని తెలిపింది. జిల్లాలో ఉన్న సుమారు 22 వేల ఎకరాల అసైన్మెంట్ భూములు ఇతరుల చేతుల్లో ఉన్నాయని పేర్కొంది. వీటి కోసం పేదలు గత కొంతకాలంగా పోరాడుతోన్న జిల్లా యంత్రాంగం స్పందించలేదని, ఏడాది నుంచి దెందులూరు మండలం దోసపాడు దళితులు, పేదలు అసైన్మెంట్ భూములు కోసం పోరాడుతున్నారని వివరించింది. దెందులూరు మండలం దోసపాడు, కొవ్వలి, పోతునూరు గ్రామాల్లో దాదాపు వెయ్యి ఎకరాల అసైన్మెంట్ భూములు ఉన్నాయని తెలిపింది. జంగారెడ్డిగూడెం మండలం పంగిడిగూడెంలో సుమారు 350 ఎకరాలు సీలింగ్ భూమి ఉందని, చింతలపూడి, టి.నర్సాపురం, చాట్రాయి, ముసునూరు మండలాల్లో వేలాది ఎకరాల అసైన్మెంట్, సీలింగ్ భూములు భూస్వాముల చేతుల్లో ఉన్నాయని పేర్కొంది. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ, అధ్యక్షుడు ఎం.జీవరత్నం, ఉపాధ్యక్షులు టి.ముత్యాలమ్మ, ఎస్ మహంకాళీరావు, సహాయ కార్యదర్శి ఎం.సుధారాణి, నాయకులు ఎం.ప్రభాకర్, సాయికృష్ణ, శ్రీదేవి పాల్గొన్నారు.

రైల్వే ప్రైవేటీకరణ ఆపాలంటూ ధర్నా

ఏలూరు (టూటౌన్) : రైల్వే ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్ వద్ద గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడంలో భాగంగా రైల్వే రంగాన్ని ప్రైవేట్ పరం చేస్తోందని విమర్శించారు. అన్ని విభాగాల్లో మౌలిక సదుపాయాలకు సంబంధించి లోకి కార్పొరేట్ సంస్థలకు ద్వారాలు తెరుస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏడాదికి రూ.2.5 లక్షల కోట్ల ఆదాయం వస్తోన్న రైల్వే రంగాన్ని పెట్టుబడిదారులకు దోచిపెట్టేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వివరించారు. రైల్వేలో ఖాళీగా ఉన్న వేలాది పోస్టులు భర్తీ చేయకుండా ప్రమాదాలకు ప్రభుత్వమే కారణమవుతుందని తెలిపారు. రైల్వే ఆదాయంలో 65 శాతం సరుకు రవాణా ద్వారానే వస్తోందన్నారు. సరుకు రవాణా కూడా ప్రైవేట్ వాళ్లకుఅప్పజెప్పేందుకు మోదీ ఉత్సాహం చూపిస్తున్నారని విమర్శించారు. వృద్ధులు, వికలాంగులు, ఇతర వర్గాలకు ఇస్తోన్న సబ్సీడీలు రద్దు చేయాలని కుట్ర చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

'ఫాస్టాక్' శిక్షణ

ఏలూరు (టూటౌన్): ఆహార పదార్థాల తయారీ, విక్రయించే విధానం, వడ్డన విషయాల్లో శుభ్రతపై అవగాహన కల్పిస్తూ ఫాస్టాక్ శిక్షణ కార్యక్రమం ఎఫ్ఎస్ఎస్ఏఐ (ఫుడ్ సేఫ్టీ అండ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) విధి విధానాలకు అనుగుణంగా గురువారం నిర్వహించారు. స్థానిక బ్రహ్మయ్య పెట్రోలు బంక్ సమీపంలోని శ్రీ కృష్ణ సాయి ప్లాజాలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ఐఐతఈఎస్‌టీ ఫెడరేషన్ రాష్ట్ర ఇన్‌చార్జి పియూష్ శర్మ, ఎఫ్ఎస్ఎస్ఏఐ అప్రూవ్డ్ శిక్షకులు యశ్వంత్ మూర్తి పాల్గొని మాట్లాడారు.

జగనన్న కాలనీలో విద్యుత్ వెలుగు



పోలసానిపల్లిలో జగనన్న కాలనీలో వీధిలైట్లకు స్విచ్ ఆన్ చేస్తున్న సర్పంచ్ షేక్ రహీమాబేగం హసీనా

భీమడోలు: జగనన్న కాలనీలు పేదల పాలిట వరమని పోలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమాబేగం హసీనా అన్నారు. నవరత్నాలు.. అందరికీ ఇళ్ల పథకంలో పోలసానిపల్లిలో జాతీయ రహదారికి అనుకునిఉన్న జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన త్రీఫేజ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం రాత్రి ఆమె స్విచ్ ఆన్‌చేసి వీధి లైట్లను వెలిగించారు. కాలనీలో 46 మందికి స్థలాలు మంజూరు చేసి, వారంతా ఇళ్ల నిర్మించుకునేలా సర్పంచ్, ప్రజాప్రతినిధులు తమ వంతు కృషి చేశారు. జగనన్న – వాసన్న కాలనీలో లబ్ధిదారులకు గృహ విద్యుత్ కనెక్షన్లతో పాటు వీధి లైట్లు కోసం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించారు. దీంతో లబ్ధిదారులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కోట శ్రీనివాసరావు, వార్డుసభ్యులు అనంతమ్మ, మడికే కనకదుర్గ అయ్యప్ప, మాజీ ఉపసర్పంచ్ అంబటి నాగేంద్ర ప్రసాద్, నాయకులు కోట దుర్గారావు, కంతేటి పెద్దిరాజు, వలంటీర్ నిర్మల, కాలనీవాసులు పాల్గొన్నారు.

గోడౌన్లలో నిల్వతోనే పంటలకు భద్రత



విజయరాయి సొసైటీలో సమావేశం నిర్వహిస్తున్న శ్యామ్‌కుమార్

పెదవేగి : గోడౌన్లలో నిల్వ చేయడం ద్వారా పంటలకు భద్రత ఏర్పడుతుందని, మంచి ధర వచ్చినప్పుడు విక్రయించుకోవచ్చని ప్రోగ్రామ్ డైరెక్టర్ శ్యామ్‌కుమార్ అన్నారు. గోడౌన్ల వినియోగంపై విజయరాయి సొసైటీలో సొసైటీ చైర్మన్ పాలడుగు సత్యనారాయణ అధ్యక్షతన గురువారం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం సొసైటీల ద్వారా గోడౌన్లు నిర్మించిందని చెప్పారు. పంట చేతికొచ్చిన సమయంలో గిట్టుబాటు ధర లేకపోతే ఆశించిన ధర లభించేదాకా పంట ఉత్పత్తులను గోడౌన్లలో నిల్వ చేసుకునే వెసులుబాటు ఉందని అన్నారు. నిల్వ చేసిన పంట ఉత్పత్తుల ధరలో 80 శాతం రుణాన్ని బ్యాంకుల ద్వారా అందిస్తున్నామని తెలిపారు. సమావేశంలో డీఆర్ అబ్దుల్ హరి, పీడీ సెల్ రీసోర్స్ పర్సన్ సూర్యప్రకాశరావు, ఏలూరు ఆర్ఆర్‌పేట బ్రాంచ్ సూపర్‌వైజర్ పణీంద్ర, డైరెక్టర్‌లు బొప్పన కృష్ణారావు, మట్టా నవీన్‌కుమార్, మాజీ చైర్మన్ మన్నె బాబురావు, నాయకులు బొమ్మారెడ్డి రామచంద్రారెడ్డి, సూపర్‌వైజర్, బ్రాంచ్‌మేనేజర్ శ్రీనివాసరావు, సొసైటీ కార్యదర్శి సీహెచ్ రాజు, వెంటరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దెందులూరు: స్థానిక సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ జేపీబీ నటరాజన్ తెలిపారు. దెందులూరు, సత్యనారాయణపురం, కొత్తగూడెం, కొమిరేపల్లి, శింగవరం గ్రామాల పరిధిలో విద్యుత్‌కు ఉండదని పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో వినియోగదారులు విద్యుత్ శాఖకు సహకరించాలని ఆయన కోరారు.